సీతాఫలం.. ఉపాధి పదిలం

- సీతాఫలంతో ఆరోగ్య ప్రయోజనాలు
- కూలీలకు ఉపాధినిస్తున్న వైనం

మడకశిరరూరల్: మధురమైన సీతాఫలం ఆరోగ్యంతోపాటు చాలా కుటుంబాలకు ఉపాధినిస్తోంది. మండలంలోని గుట్ట, కొండ ప్రాంతాల్లో వర్షాధారంగా లభించే సీతాఫలం కాయలను ప్రజలు తీసుకొచ్చి మడకశిర పట్టణంలోని ప్రధాన సర్కిల్లో ఉంచుకుని విక్రయిస్తున్నారు. వివిధ గ్రామాల ప్రజలు సీజన్‌లో సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు మూడు నెలలు పాటు ఉపాధి పొందుతున్నారు. పేదవాడి ఆపిల్‌గా పిలిచే సీతాఫలంలో ఫైబర్స్, ఖనిజాలు, మిటమిన్లు వంటివి పుష్కలంగా ఉంటాయి. ప్రధానంగా అధిక ఫైబర్ ఉండటంతో జీర్ణక్రియకు సహాపడుతుంది. పేగు కదిలికలను సాధారణంగా ఉంచడం ద్వారా మలబద్ధకాన్ని నివారిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఉండడంతో ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి. ప్లేవనాయిడ్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను నివారించడంలో సహాయపడతాయి.

200 కుటుంబాలకు పైగా ఉపాధి

మండలంలోని ఏఆర్‌రొప్పం, ఎగువ, దిగువ రామగిరి, హెచ్‌ఆర్‌పాళ్యం, గౌరిపురం, గుండుమల, కంబాలపల్లి, గుర్రపుకొండ, ఉగ్రేపల్లి, గుడిబండ మండలంలోని బూదిపల్లి, కేకాతి తదితర గ్రామాల ప్రజలు వేకువజామున గుట్టలు,కొండల్లోకి వెళ్లి సీతాఫలం చెట్లు నుంచి కాయలను కోసుకొచ్చి మడకశిర పట్టణంలో విక్రయిస్తున్నారు. మరికొంత మంది పావగడలో విక్రయిస్తున్నారు. సెప్టెంబర్ నుంచి నవంబర్ నెల వరకు దాదాపు 200 కుటుంబాలు సీతాఫలం కాయల ద్వారా ఉపాధి పొందుతున్నారు. చిన్న సంచిలో ఉంచిన కాయల నాణ్యత, సైజును బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా మహిళలు సీతాఫలాలను గంపలో ఉంచుకొని పట్టణంలోని వీధుల్లో కాయ రూ.5, రూ.10 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు.



మడకశిరలో సీతాఫలాలను విక్రయిస్తున్న దృశ్యం

రోజు రూ.350పైగా సంపాదన



కదిరేపల్లి సమీపంలోని కొండ, గుట్టల్లోకి వేకువజామున వెళ్లి సీతాఫలం కాయలను తెంపుకొని మడకశిర బస్టాండ్‌లో విక్రయిస్తున్నాం. రోజుకు రూ.350పైగా సంపాదించుకుని ఇంటికి వెళుతున్నా. మూడు నెలలు పాటు ఉపాధి పొందుతాను.

– మూర్తి కూలీ, కదిరేపల్లి, మడకశిర మండలం

మూడు నెలలు ఉపాధి



రామగిరి, ఏఆర్ రొప్పం కొండల్లో చెట్లు అధికంగా ఉన్నాయి. ఇద్దరు, ముగ్గురం కలిసి వేకువజామున కొండల్లోకి వెళ్లి రోజూ రెండు చిన్న బస్తాల నిండా సీతాఫలం కాయలను తీసుకొస్తున్నాం. ఏటా మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది.

– భీమప్ప, ఏఆర్ రొప్పం, మడకశిర మండలం

సీతాఫలం ఆరోగ్యకరం



సీతాఫలం మనిషి ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుంది. ప్రధానంగా గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. క్యాన్సర్ ప్రమాదాన్ని పూర్తిగా తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది.

– డాక్టర్ నరేష్‌కుమార్,కదిరేపల్లి పీహెచ్‌సీ, మడకశిర మండలం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌గా జి.శ్రీనివాసులు



జి. శ్రీనివాసులు



మంజు

సోమందేపల్లి: వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్‌గా గోవిందమ్మ గారి శ్రీనివాసులును ఎంపిక చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ గురువారం తెలిపారు. అలాగే పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడిగా నేసే సామాజిక వర్గానికి చెందిన మంజునాథ్‌ను ఎంపిక చేశారు. కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించినందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

హిందూపురం అర్బన్: సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధంలా ఉపయోగపడుతుందని ఒకటో పట్టణ సీఐ రాజగోపాల్ నాయుడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రోటరీక్లబ్ సమాచార హక్కు చట్టంపై రోటరీ క్లబ్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఆర్డీఓ ఆనంద కుమార్ మాట్లాడుతూ.. 2005లో కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రతి పౌరుడు తనకు కావాల్సిన సమాచారాన్ని అడిగితే 30 రోజుల్లో అందించాల్సి ఉందన్నారు. ఒక వేళ సమాచారం గడువులోపు ఇవ్వకపోతే అప్పిలేట్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అక్కడ కూడా న్యాయం జరగకపోతే స.హ చట్టం కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. సమాచారం ఉండి ఇవ్వని అధికారులపై పలు సెక్షన్లపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్, రోటరీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోనాపురంలో 'పొలం పిలుస్తోంది'

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట పొలాల్లో పరిశీలన చేసి రైతులకు చీడపీడల నివారణ, తగిన మందుల వినియోగం, కలుపు నివారణలో తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. రైతులు సాగు వ్యయం తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలని ఏఓ చందన సూచించారు.

ఘనంగా విశ్వ దృష్టి దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో విశ్వ దృష్టి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పాలన వైద్యాధికారి డా.ఏఎస్ఎల్ బాబు మాట్లాడుతూ అన్ని ఇంద్రియాల కంటే ప్రధానమైన కంటిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తాలూకా వైద్యాధికారి డా.కిరణ్ కుమార్ మాట్లాడుతూ కంటి జబ్బులను తాత్సారం చేయకుండా నేత్ర వైద్య నిపుణులతో చూపించు కోవాలన్నారు. నేత్ర వైద్యురాలు పవిత్ర, ఎన్‌సీడీ సిబ్బంది చంద్రకళ, ఎండీ ఖాసీం, ఓంకార్, గొల్లలప్ప, లలితమ్మ పాల్గొన్నారు.

కందిపప్పు, చక్కెర పంపిణీ చేయాలి

మడకశిర: పట్టణంలోని తెల్ల రేషన్‌కార్డులు కలిగిన వారికి ప్రభుత్వం విజయ దశమి పండుగను దృష్టిలో పెట్టుకుని కంది పప్పు, చక్కెరను పంపిణీ చేయాలని 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం కందిపప్పును కేవలం 30 శాతం మంది లబ్ధిరులకే మాత్రమే పంపిణీ చేసిందని తెలిపారు. డీలర్లు కావాల్సిన వారికి కందిపప్పును అందించి మిగిలిన వారికి ఇవ్వకుండా చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. చక్కెర కూడా పూర్తి స్థాయిలో అందించడం లేదని గుర్తు చేశారు.

ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అమరాపురం: హలుకూరు గ్రామ సమీపంలో వున్న కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కావెంజర్, చౌకీదార్ పోస్టులకు ఆఫ్‌లైన్‌లో మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రాఘవయ్య తెలిపారు. ఓసీ కేటగిరి అభ్యర్థులు 18 నుంచి 42 ఏళ్లలోపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 47 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 15 లోపు స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓకు అందజేయాలని సూచించారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోండి

పరిగి(సోమందేపల్లి): పరిగి మండలంలోని ఊటకూరు గ్రామంలోని అక్రమ లే ఔట్‌లపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హసీనా సుల్తానాకు ఈశ్వర్, కిరణ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. చెరువుల సమీపంలో నిబంధనలు పాటించకుండా లేఅవుట్లు వేస్తున్నారన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రుణాల మంజూరులో రైతులకు పెద్దపీట

అమరాపురం: రుణాల మంజూరులో రైతులకు పెద్దపీట వేసినట్లు కెనరా బ్యాంకు మేనేజర్ బీహార, ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్ పేర్కొన్నారు. బుధవారం సాయంకాలం స్థానిక కెనరా బ్యాంకులో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది బ్యాంకులో రైతులు, విద్యా, వ్యాపార, గృహాలు, వాహనాలు, బంగారు ఆభరణాలపై విరివిగా రుణాలు అందించామన్నారు. ఈ ఏడాది బ్యాంకులో రూ.215 కోట్ల టర్నోవర్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వార్షిక నివేదికను మేనేజర్ చదివి వినిపించారు. ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిరరూరల్: గుండుమల కెనారా బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం బ్యాంకులో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. బ్యాంకు మెదటి ఖాతాదారుడు మాజీ సర్పంచ్ చంద్రప్పను సన్మానించారు. బ్యాంకు క్యాషియర్ వంశీకృష్ణ, సీసీ నరసింహమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్

గుడిబండ: స్థానిక కెనరా బ్యాంక్ ఆవరణలో గురువారం మేనేజర్ మల్లయ్య ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఓటీపీ నంబర్లు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళి



రతన్‌టాటా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డ్రైవర్లు

మడకశిర: పట్టణంలో గురువారం పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతికి సింహగిరి ఫోర్‌వీల్స్ డ్రైవర్లు, ఓనర్ల అసోసియేషన్ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ కార్యాలయం ఎదుట రతన్‌టాటా చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రతన్‌టాటా ఒక పారిశ్రామిక దిగ్గజంతో పాటు మానవతావాది అని కూడా కొనియాడారు. ఆయన ప్రపంచంలో లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఆయన మృతి దేశ ప్రజలకు ఎంతో నష్టమన్నారు.

మద్యం టెండర్లకు 'అష్టమి సెంటిమెంట్'

పెనుకొండ రూరల్: మద్యం టెండర్లకు అష్టమి సెంటిమెంట్ అడ్డువచ్చింది, 1వ తేదీ నుంచి ఆశావాహులు దరఖాస్తులు అందజేస్తున్నారు. అదనంగా మరో రెండు రోజుల ప్రభుత్వం గడువు పొడిగించింది. అయితే గురువారం అష్టమి కావడంతో పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 13 షాపులకు గాను, కేవలం 14 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకూ మొత్తం 184 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సృజన బాబు తెలిపారు.

పంట నష్ట పరిహారం చెల్లించండి



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: తాలూకా వ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టితో దెబ్బ తిన్న వేరుశనగ, రాగి, పత్తి, పూల పంటలకు నష్ట పరిహారాన్ని చెల్లించి బాధిత రైతులను ఆదు కోవాలని స్థానిక హసిరు సేన, రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అతిథి గృహంలో గురువారం నిర్వహించిన రైతు సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధుగిరి, శిర, కొరటగెరె, పావగడ తాలూకాల్లో చింత పంట అధికంగా పండిందని అయితే కూలీల కొరతతో చింత కాయల తొలగించక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. కొబ్బరి పంటకు తెగులు మొదలైందని, వెంటనే రోగ నియంత్రణకు అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నలిగానహళ్లి మంజునాథ్, బ్యాడనూరు శివు, చిత్తయ్య, జంపణ్ణ, ఈరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

గోరంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక 271, 274 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గురువారం తహసీల్దార్ మరుతి ఆధ్వర్యంలోని రెవెన్యూ సిబ్బంది జేసీబీల సాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు



కిరాణా షాపులపై పోలీసులు దాడులు చేస్తున్న దృశ్యం

గోరంట్ల: 14 ఏళ్లలోపు పిల్లలను కిరాణ షాపులు, చిన్న పరిశ్రమల్లో పనుల్లో పెట్టుకుంటే సంబంధిత యాజమానులపై కేసులు నమోదు చేస్తామని గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐ శేఖర్ హెచ్చరించారు. గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఇటుకల బట్టీలు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, గుజరీ దుకాణాలపై దాడులు చేశారు. దాడుల్లో 14 మంది బాల కార్మికులను గుర్తించామని , పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

అయోధ్యకు పాదయాత్ర



అయోధ్య రాముడి దర్శనార్థం పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

పెనుకొండ రూరల్: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని బసవేశ్వర నగర్‌కు చెందిన తులసీ కృష్ణ, తన మిత్రుడు రాజన్నతో కలసి దాదాపుగా 2వేల కిలో మీటర్లు అయోధ్య రామ మందిరానికి పాదయాత్రగా బయలు దేరాడు. ఐదు రోజులుగా క్రితం బయలుదేరగా గురువారం గుట్టూరుకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు స్వాగతం పలికారు.

మహమ్మద్ ప్రవక్తపై వ్యాఖ్యలు దుర్మార్గం

హిందూపురం: మహమ్మద్ ప్రవక్తపై విద్వేష వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్ నరసింగానంద్‌పై చర్యలు తీసుకోవాలని టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, ప్రజా సంఘాల నాయకులు కోరారు. గురువారం సీఐ కరీంబాషాకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. దేశంలో అన్ని మతాలు సమానమని.. నచ్చిన మతాన్ని అవలంభించేందుకు మత స్వేచ్ఛను ప్రసాదించిందన్నారు. కార్యక్రమంలో అహలే సున్నతుల్ జమాత్ కమిటీ అధ్యక్షుడు దౌలా సాబ్ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ముకాన్‌దార్ ఇమ్రాన్ అలీ ఖాన్,ఉబెదుల్లా హుసేన్, షేక్ షబ్బీర్, వివిధ పార్టీ నాయకులు షౌకత్, రఫీక్, అజ్మతుల్లా ఖాన్,జమీల్, అమానుల్లా, చైతన్య గంగిరెడ్డి, వాల్మీకి శివకుమార్, మింటూమనోజ్, పాస్టర్ సూర్య ప్రకాష్, వినోద్ కుమార్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



టూటౌన్ సీఐకు వినతిపత్రం అందజేస్తున్న ఉమర్‌ఫారూఖ్ ఖాన్, తదితరులు

ఆర్టీసీ బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో గురువారం మడకశిర- కర్నూలు మధ్య తిరిగే నూతన ఆర్టీసీ బస్సును స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయాపురం సర్వీసు..

రొళ్ల: ఆర్టీసీ అధికారులు గురువారం ఎం.రాయాపురం సర్వీసును ప్రారంభించారు. ఆర్టీసీ బస్సు గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. బస్సు రోజూ ఉదయం 5:30 గంటలకు మడకశిరలో బయలుదేరి జంబులబండ, గుడిబండ, మందలపల్లి, మల్లినమడుగు, జీరిగేపల్లి, హునిసేకుంట, ఎం.రాయాపురం, మధూడి, ఆలుడి మీదుగా ఉదయం 7.30 గంటలకు శిరా పట్టణం చేరుకుంటుంది. తర్వాత తిరిగి అదే ప్రాంతాల మీదుగా ఉదయం 9 గంటలకు మడకశిరకు చేరుకోనుంది. మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4 గంటలకు సర్వీసు నడుపుతామని అధికారులు తెలిపారు.

ఎక్సైజ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీ



ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

మడకశిర: పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై సిబ్బందితో ఆరా తీశారు. మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మడకశిర నియోజకవర్గంలోని 10 మద్యం షాపులకు గురువారం నాటికి 89 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహాచండీ యాగం

హిందూపురం: పట్టణంలోని కంసాలపేటలో వెలసిన చౌడేశ్వరీ దేవి గుడిలో గురువారం విరుపాక్షేశ్వర స్వామి చౌడేశ్వరీ మాతను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదంపండితుల ఆధ్వర్యంలో మహాచండీ యాగం చేసి, పూర్ణ హారతి సమర్పించారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు సోమశేఖర్, కార్యదర్శి నంజుండప్ప, కోశాధికారి రాజశేఖర్, మునిరంగప్ప తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

గుడిబండ: హెచ్‌ఆర్ హట్టి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత క్రిష్టప్ప కుమారుడు ముద్దప్ప వివాహం విధురాశ్వత్థంలో గురువారం జరిగింది. వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సర్పంచ్ కరుణాకర్‌గౌడు, నాయకులు చిక్కన్న, రంగధామప్పనాగరాజు పాల్గొన్నారు.

పరిగి(సోమందేపల్లి): పరిగి మండలంలోని ముద్దిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరయ్య, శంకరప్ప నూతన గృహ ప్రవేశానికి మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ హాజరయ్యారు. అలాగే స్థానిక బీరలింగేశ్వరస్వామి కల్యాణ మంటపంలో మాజీ వైస్ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి తనయుడు భరత్ రెడ్డి వివాహ వేడుకలకు హాజరయ్యారు. వధూవరులను ఆమె ఆశీర్వదించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

మడకశిర: నియోజకవర్గానికి సంబంధించి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం కాకుండా చూడాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. గురువారం మడకశిరలో ఆర్డీఓ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఉన్నారు.

అధ్వానంగా రహదారి

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం వద్ద పాత హైవే అధ్వానంగా మారింది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సైతం అనేక సార్లు ఈ రోడ్డు గుండా వెళ్తుంటారు. కానీ రోడ్డు మాత్రం మరమ్మత్తుకు నోచుకోలేదు. అధికారులు స్పందించి రోడ్డును మరమ్మత్తు చేయించాలని ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



తిమ్మాపురం వద్ద అధ్వాన్నంగా మారిన పాత జాతీయ రహదారి

నవదుర్గా నమోనమః

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణలో పూజలందుకున్నారు. అర్చకులు అమ్మవార్లకు పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద అన్నదానం చేపట్టారు. లేపాక్షి దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

– సాక్షిబృందం:



పావగడ: పసుపు కొమ్ముల అలంకరణలో దుర్గాదేవి



పెనుకొండలో దుర్గామాతగా వాసవీ మాత



మడకశిరలో శాకాంబరి దేవిగా వాసవీ కన్యకా పరమేశ్వరి



హిందూపురం: నాట్యకృష్ణ అలంకరణలో వేంకటేశ్వరుడు



లేపాక్షిలో ప్రత్యేక అలంకరణలో కొలువైన దుర్గాదేవి